




సత్య శారదాదేవి (వరంగల్) | ప్రావీణ్య (హనుమకొండ) | రాహుల్ శర్మ (భూపాలపల్లి) | దివాకర (ములుగు)

ఈసీ లేదు.. వీసీ లేరు..



- కాకతీయ యూనివర్సిటీకి దిక్కెవరు?
- పాలక మండలి ఏర్పాటులో తాత్సారం
- గత అక్టోబరులోనే ముగిసిన ఈసీ పదవీకాలం
- మే 21న ముగిసిన వైస్ చాన్స్‌లర్ పదవీకాలం
- ఇన్‌చార్జి వీసీ పాలనలోనే వర్సిటీ
- కేయూలో కీలక నిర్ణయాలపై ప్రభావం
- ఈసీ లేకపోవడంతో ఏర్పాటు కాని సెర్చ్ కమిటీ
- కేయూ ప్రక్షాళనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని విజ్ఞప్తులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాకతీయ యూనివర్సిటీలో పాలన అస్తవ్యస్తంగా మారింది. 8 నెలలుగా పాలక మండలి (ఈసీ), మే 21వ తేదీ నుంచి పూర్తిస్థాయి వైస్‌చాన్సలర్ లేక కేయూలో పాలన గాడి తప్పుతోంది. 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఈసీ, వీసీ లేకపోవటంతో వర్సిటీకి సంబంధించిన ప్రధానమైన నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీలకు వీసీల నియామకం కోసం సెర్చ్ కమిటీలను నియమించిన ప్రభుత్వం.. కేయూకి మాత్రం ఈసీ లేకపోవటంతో కమిటీ వేయలేకపోయింది. దీంతో కొత్త పాలక మండలి ఎప్పుడు వస్తుందో..? యూనివర్సిటీకి కొత్త వీసీని ఎప్పుడు నియమిస్తారో? అనే ఉత్కంఠతో ప్రొఫెసర్లు, విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

ముగిసిన ఈసీ, వీసీల పదవీకాలం

పైరవీలు, అక్రమాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన కాకతీయ యూనివర్సిటీ ప్రక్షాళన కలగానే మారుతోంది. పాలకమండలికి కొత్త కమిటీని నియమించటంలో చేస్తున్న తాత్సారం విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. గత అక్టోబరు 22వ తేదీనే కేయూ పాలక మండలి పదవీకాలం ముగిసింది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎన్నికల కోడ్ కారణంగా కొత్త ఈసీలను నియమించటం కుదరలేదు. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తామని మాట ఇచ్చింది. అయితే ఇప్పటి వరకు కనీసం కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీని ప్రభుత్వం నియమించలేదు. దీంతో యూనివర్సిటీలో కీలకమైన నిర్ణయాలు తీసుకోవటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, గత నెల 21వ తేదీన కేయూ వైస్ చాన్సలర్ రమేష్ పదవీకాలం పూర్తి అయింది. దీంతో కేయూకు సీనియర్ ఐఏఎస్ అధికారిణి కరుణ ను ఇన్‌చార్జి వీసీగా ప్రభుత్వం నియమించింది. ఇదిలా వుండగా, 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో యూనివర్సిటీలో కొత్త కోర్సుల ప్రవేశ పెట్టడంతో పాటు వేతనాలు, ఉద్యోగ నియామకాలు, కొత్త ప్రాజెక్టుల నిర్వహణకు కావాల్సిన బడ్జెట్‌తో పాటు కేయూ భూముల అక్రమణాలు, వివిధ కమిటీల నివేదికలపై నిర్ణయం తీసుకోవాల్సిన పాలకమండలి, పూర్తి స్థాయి వైస్‌చాన్సలర్ లేకపోవటం సమస్యాత్మకంగా మారింది.

సెర్చ్ కమిటీ కూడా లేదాయే..

కాకతీయ యూనివర్సిటీకి వైస్‌చాన్సలర్‌ను నియమించేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీని కూడా నియమించలేదు. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులను నియమిస్తారు. వీరిలో ఒకరు ప్రభుత్వం నుంచి, మరొకరు విద్యాశాఖ నుంచి ఉంటారు. ఇంకొకరిని యూనివర్సిటీ పాలక మండలి నుంచి సూచిస్తారు. ఈ ముగ్గురు నేతృత్వంలో సెర్చ్ కమిటీ వైస్‌చాన్సలర్‌ను ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తుంది. అయితే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పూర్తి స్థాయి పాలక మండలి ఉన్నప్పుడే సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ఖరారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే కేయూ నుంచి మాత్రం సెర్చ్ కమిటీ సభ్యుడిని ఎంపిక చేయకుండానే అక్టోబరులో పాలక మండలి పదవీ కాలం పూర్తయింది. గత వీసీ నిర్లక్ష్యంతో సెర్చ్ కమి టీని ఎంపిక చేయలేదని ఆకుట్ సభ్యులు విమర్శిస్తున్నారు.

దరఖాస్తు చేసుకున్నా..

రాష్ట్రంలోని అన్ని యూని వర్సిటీలకు వైస్‌చాన్సలర్ నియామకం కోసం ప్రభుత్వం జనవరి 27వ తేదీన నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరించింది. కాకతీయ యూనివర్సిటీకి 149 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కేయూకు మినహా మిగతా తొమ్మిది యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇటీవల సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ సెర్చ్ కమిటీలు వచ్చిన దరఖా స్తులను పరిశీలిం చారు. ఈ నెలఖారు లోగా తొమ్మిది యూనివర్సి టీలకు కొత్త వైస్‌చాన్సలర్‌లను నియమించనున్నారు.

కానీ కాకతీయ యూనివర్సిటీకి మాత్రం ఇన్‌చార్జి వీసీనే దిక్కుగా మారనున్నారనే చర్చ జరుగుతోంది. అయితే కేయూకు కొత్త పాలక మండలి నియామకం తరువాతే సెర్చ్ కమిటీని ఏర్పాటు చేస్తారని, ఆ తరువాతనే కొత్త వీసీ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాకతీయ యూనివర్సిటీకి పాలక మండలిని నియమించి, వీసీ నియామకం కోసం సెర్చ్ కమిటీని కూడా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, విద్యావేత్తలు, ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాలకమండలి-విధులు

యూనివర్సిటీలో 13మందితో పాలక మండలిని నియమిస్తారు. ప్రతీ యూనివర్సిటీ ఈసీకి వైస్‌చాన్సలర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మిగతా 13మంది సభ్యుల్లో విద్యాశాఖ, ఆర్థికశాఖ, కళాశాల విద్యాశాఖ కమిషనర్, (సాంకేతిక యూనివర్సిటీ అయితే సాంకేతిక విద్యాశాఖ కమిషనర్) ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఉంటారు. అలాగే యూనివర్సిటీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులు, డిగ్రీ కాలేజీల నుంచి ఒక ప్రిన్సిపాల్, ఒక అధ్యాపకుడు, సమాజంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను నలుగురిని కలుపుకుని మొత్తం 13మందితో సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. ఈ కమిటీ తీసుకునే నిర్ణయమే విధానంగా మారుతుంది. యూనివర్సిటీకి సంబంధించిన ఏ పని చేయాలన్న ఈసీ అనుమతి తప్పనిసరి. దానినే వీసీ అమలు చేస్తారు. అంతేకాకుండా అకడమిక్, అడ్మినిస్ట్రేషన్, ప్రమోషన్స్, ఉద్యోగాల భర్తీ, సైంటిఫిక్ పరికరాలు, ల్యాబ్ వస్తువుల కొనుగోలు, యూజీసీ నిధులు వినియోగం ఇలా అన్నింటికీ ఈసీ ఆమోదం తప్పనిసరి.



వరంగల్ కలెక్టర్‌గా సత్య శారదాదేవి

ప్రస్తుత కలెక్టర్ హనుమకొండకు బదిలీ

వరంగల్ కలెక్టరేట్, జూన్ 15: వరంగల్ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అగ్రికల్చర్, కో ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న సత్య శారదాదేవి నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన బదిలీల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కలెక్టర్ పి.ప్రావీణ్య హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా 2021 సెప్టెంబరు 3న బాధ్యత లు చేపట్టిన ప్రావీణ్య సుమారు 18నెలలపాటు కమిషనర్‌గా పనిచేశారు. ఇదే సమయంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఇన్‌చార్జి వీసీగా సైతం బాధ్యతలు నిర్వర్తించారు. 2023 మార్చి 13న కలెక్టర్‌గా పి.ప్రావీణ్య బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూనే అప్పటి కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లడంతో రెండు నెలల పాటు జీడబ్ల్యూఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్‌గా ప్రావీణ్య సుమారు 15నెలల కాలంలో జిల్లాలో తనదైన ముద్ర వేశారు. పలు సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్‌గా సత్య శారదాదేవి నేడు (ఆదివారం) బాధ్యతలు స్వీకరించనున్నారు.

హనుమకొండ కలెక్టర్‌గా ప్రావీణ్య..

హనుమకొండ కలెక్టరేట్: హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నారాయణపేటకు బదిలీ అయ్యారు. జిల్లాకు నూతన కలెక్టర్‌గా వరంగల్ జిల్లా కలెక్టర్‌గా పని చేస్తున్న పి.ప్రావీణ్యను నియమించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొద్ది రోజులకే ప్రభుత్వం తాత్కాలిక బదిలీలు జరి పింది. గత ప్రభుత్వ హయాంలో పలు స్థానాల్లో ఉన్నవారిని మార్చింది. అనంతరం లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడంతో బదిలీలు నిలిచాయి. హనుమకొండ కలెక్టర్‌గా సిక్తాపట్నాయక్ 2023 ఫిబ్రవరి 1న బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు నిజామాబాద్‌కు బదిలీ కాగా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సిక్తా పట్నాయక్‌ను హనుమకొండ కలెక్టర్‌గా నియమించారు. 16నెలల పాటు జిల్లాలో సమర్థ పాలన అందించారు.

ములుగు, భూపాలపల్లి కలెక్టర్లకూ స్థానచలనం..

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్: భూపాలపల్లి, ములుగు జిల్లాల కలెక్టర్లు భవేష్ మిశ్రా, ఇలా త్రిపాఠి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో భూపాలపల్లికి రాహుల్ శర్మ, ములుగుకు దివాకర బదిలీపై వస్తున్నారు. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాహుల్ శర్మ ప్రస్తుతం వికారాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)గా పనిచేస్తున్నారు. భూపాలపల్లి కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. భూపాలపల్లి కలెక్టర్‌గా పనిచేసిన భవేష్ మిశ్రాకు ప్రభుత్వం ఎలాంటి పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన జీఏడీలో రిపోర్ట్ చేయనున్నారు. ములుగు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇలా త్రిపాఠి బదిలీ కాగా, ఆమె స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా కొన సాగుతున్న 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దివాకర రానున్నారు. ఈయన 2021 ఆగస్టు నుంచి 2023 జూలై 15వరకు భూపాలపల్లిలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ములుగు కలెక్టర్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

కుడా వీసీగా అశ్వినీ బాధ్యతలు



వరంగల్ కార్పొరేషన్, జూన్ 15: కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్‌పర్సన్‌గా అశ్విని తానాజీ వాకడే పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. శనివారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ వాకడేను కుడా ఉన్నతాధికారులు కలిసి పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ ను కలిసిన వారిలో సీపీవో అజిత్‌రెడ్డి, భీంరావు, మురళీధర్, సత్యనారాయణ, పారుఖ్‌లు ఉన్నారు.

20న బల్దియా సర్వసభ్య సమావేశం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 15: వరంగల్ నగర పాలక సంస్థ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఈ నెల 20న ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్నట్లు మేయర్ గుండు సుధారాణి శనివా రం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ సమావేశం మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని తెలిపారు. 2024-25 సంవత్సరం బడ్జెట్ అంచనాలు, 2023-24 సవరించిన బడ్జెట్ అంచనాలపై చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- మేయర్ గుండు సుధారాణి
- కమిషనర్‌తో కలిసి 9వ డివిజన్‌లో పర్యటన



కల్వర్టును పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 15: గ్రేటర్ వరంగల్ 9వ డివిజన్‌లోని కాకతీయ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ గుండు సుధారాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం డివిజన్‌లోని అలంకార్ జంక్షన్, కాకతీయ కాలనీ, యాదవనగర్, అమృత థియేటర్, హనుమకొండ పోస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పర్యటించారు. శానిటేషన్, డిసిల్టింగ్ పనులను పరిశీలించి నిర్వాహణ చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. వంద ఫీట్ల రోడ్డు ప్రాంతంలో రోడ్డు చివరన రోడ్డు వేయడానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు కూడా మంజూరు చేశామన్నారు. అలంకార్ ప్రాంతంలో డ్రైనేజీల నుంచి తీసిన సిల్ట్‌ను వెంటనే అక్కడి నుంచి తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ చీకటి శారద, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ రాజయ్య, డీఈ రవికుమార్, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.


అభివృద్ధి పనులు పూర్తి చేయండి..

వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులలో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. డివిజన్‌ల వారిగా కూలంకశంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వరంగల్ మహానగరంలో పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, స్మార్ట్‌సిటీ తదితర పథకాల కింద కొనసాగుతున్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఇంకా టెండ్ అయిన పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. ఇంకా మిగిలి ఉన్న పనులకు జనరల్ ఫండ్‌ను కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్ బాబు, రవికిరణ్, సారంగం, రంగారావు, జేఏవో సరిత, ఏఈలు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో కార్ల దొంగల ముఠా?

మట్టెవాడ, జూన్ 15: వరంగల్ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోని ఓ పోలీస్ స్టేషన్‌లో అంతర్ జిల్లా కార్ల దొంగల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వరంగల్ నగరంలోని జేసీబీ వాహనం విక్రయంలో జరిగిన మోసంతో అంతర్ జిల్లా ముఠాకు సంబంధించినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. దీంతో పోలీసులు ఈ అంతర్ జిల్లా కార్ల దొంగలు ముఠాను పట్టుకునేందుకు వారం రోజులుగా తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఎట్టకేలకు నలుగురు ముఠా సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు సమాచారం. రంగారెడ్డి జిల్లా, జగద్గిరిగుట్ట, పెద్దపల్లి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఈ ముఠా రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో కార్లను దొంగిలించి వేరే రాష్ట్రాలలో విక్రయించినట్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం. పోలీసులు ఆరు కార్లను స్వాధీనం పర్చుకున్నట్లు మరికొన్ని కార్లను స్వాధీన పర్చుకునేందుకు వరంగల్ పోలీసు ప్రత్యేక బృందాలను రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో గాలింపు చేపడుతున్నట్లు తెలిసింది.

ఇంకెన్నాళ్లు?



రేషన్ కార్డుల కోసం ఎదురుచూపులు

ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్న అర్హులు

ఎన్నికలు ముగియడంతో ఆశలు

వరంగల్ కలెక్టరేట్, జూన్ 15: నూతన రేషన్‌కార్డుల జారీపై ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం కొత్త కార్డులకు శ్రీకారం చుడుతుందనే ఆశతో పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు శ్రీకారం చుట్టగా, ఈ పథకాలన్నింటికి రేషన్ కార్డులే ప్రామణికంగా తీసుకుంటోంది. అయితే, అర్హులకు న్యాయం జరిగేందుకు కొత్త కార్డులను మంజూరు చేయాలని భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ఎన్నికలు ముగియడంతో ఆశలు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రకటించడంతో అర్హుల్లో ఆశలు చిగురించాయి. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడంతో నూతన రేషన్ కార్డుల ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభిస్తుందనే ఆశతో ఉన్నారు. గత ప్రభుత్వంలో కార్డుల ప్రక్రియ అంతంత మాత్రంగానే సాగింది. ఆధార్ అనుసంధానం, పేర్లలో తప్పుల సవరణలు తదితర కారణాలతో సవరించుకున్న వారి రేషన్ కార్డులు జాబితాలో లేకుండా పోయాయి. దానికి సంబంధించిన వివరాలు స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లోనూ అందుబాటులో లేకపోవడం వివిధ పథకాలకు అర్హులైన వారు చాలా మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

ఓపెన్ కాని లాగిన్

సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వాలు రేషన్ కార్డులనే ప్రమాణికంగా తీసుకుంటున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం ఈపాస్ సైట్‌ను వినియోగించుకునేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు అవకాశం కల్పించింది. సవరణలకు దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు పంపాల్సి ఉంటుంది. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 3,826 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ సుమారు నాలుగు సంవత్సరాలుగా లాగిన్ ఓపెన్ కాకపోవడంతో నూతన రేషన్ కార్డుల కోసం ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

అందని ప్రభుత్వ పథకాలు..

డబుల్ బెడ్‌రూమ్, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డే ప్రామాణికంగా అధికారులు పరిగణిస్తున్నారు. ఇంటింటి సర్వే చేపట్టినట్లు చెప్పిన అధికారులు ఎంత మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ఎంత మందిని తిరస్కరించారు. ఏ కారణాల చేత తిరస్కరించారనేది మాత్రం ఇప్పటి వరకు చెప్పడం లేదు. ఒకే కుటుంబానికి చెందిన వారు వివాహాల తర్వాత విడిగా ఉంటున్నారు. ఇలాంటి కుటుంబాలలో పేరును తొలగించినా కొత్త రేషన్‌కార్డులు మాత్రం జారీ కాలేదు. ఇలాంటి వారు జిల్లాలో వేలసంఖ్యలో ఉన్నారు. ఒక కుటుంబంలో ఎవరైనా చనిపోతే వారి పేరును నెల రోజుల్లో తొలగిస్తున్నారు. అదే క్రమంలో పుట్టిన వారి పేర్ల నమోదుకు మాత్రం అవకాశం లేదు. ఆధార్ కార్డుల్లోనూ మార్చుకునే అవకాశం కల్పించడం లేదు. బయో మెట్రిక్ పని చేయక, ఈ పాస్‌లో వేలిముద్ర సరిగా పడక పోయినా రెండు నెలల తర్వాత రేషన్ జాబితాలో పేరు లేకుండా పోతోంది. సమస్యల్ని అధిగమించి ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 15: యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం జరిగే ఈ పరీక్షకు హనుమకొండ జిల్లాలో 11 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 4,730 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటలకు జరుగుతుంది. అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరుగుతుంది. ఉదయం సెషన్‌కు అభ్యర్థులను ఉదయం 9గంటల నుంచే పరీక్షా హాల్‌లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం సెషన్‌కు 2గంటల నుంచి పరీక్షాహాల్‌లోకి అనుమతించనున్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం టీజీఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. ఆయా పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు మూసి వేయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవతసర మెడికల్ ఎమర్జెన్సీ సదుపాయాలు ఉంటాయి. పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నగరంలో 144 సెక్షన్

వరంగల్ క్రైం: సివిల్స్ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు గాను ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ అభిషేక్ మోహంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదని ఆయన పేర్కొన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వనిత

వరంగల్ క్రైం, జూన్ 15: భర్త వేధింపులు తట్టుకోలేక మాలోతు వనిత(36) అనే మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన బానోతు వీరస్వామి తన కూతురు వనితను 2014లో చెన్నరావుపేట టీకే తండాకు చెందిన మాలోతు బన్సీలాల్‌కు ఇచ్చి వివాహం చేశాడు. వివాహ సమయంలో రూ.20లక్షల కట్నం, బంగారు ఇచ్చాడు. హైదరాబాద్‌లో రైల్వేలో ఉద్యోగం చేసే బన్సీలాల్ చెడు వ్యసనాలకు అలవాటుపడి భార్య వనితను వేధిస్తున్నాడు. వనితను బన్సీలాల్‌తో పాటు సోదరుడు, అతడి భార్య వేధిస్తున్నారు. ఇటీవల హనుమకొండలోని పుట్టింటికి వచ్చిన వనిత.. ఈనెల 10న చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం హైదరాబాద్ యశోదకు తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. తన కూతురు మృతికి కారకులైన అల్లుడు, అతడి సోదరుడు, అతడి భార్యపై శనివారం వీరస్వామి సుబేదారి పోలీసులకు పిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్నారు.

కేయూలో ఇద్దరికి డాక్టరేట్


పుల్ల శ్రీనివాస్


పి. స్వప్న

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: కేయూలో ఇద్దరు పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్‌ను ప్రకటిస్తూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎస్.నర్సింహాచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కామర్స్ విభాగంలో 'పెర్ఫార్మెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ పవర్ సెక్టార్ ఎ స్టడీ' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ డి.సక్రియ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పుల్ల శ్రీనివాస్‌కు డాక్టరేట్ ప్రకటించారు. అలాగే తెలుగులో రావికంటి వసునందన్ వచన రచనలు-సమగ్ర అధ్యయనం అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసిన పి.స్వప్నకు డాక్టరేట్‌ను ప్రకటించారు.

ట్యాక్స్ బార్ పాలక మండలి సభ్యుడిగా పీవీ నారాయణరావు


పీవీ నారాయణరావు


వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల ట్యాక్స్ బార్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడిగా వరంగల్‌కు చెందిన ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ పీవీ నారాయణరావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు బొజ్జ మధుసూదన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవలను అందిస్తున్న అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం నిరంతం కృషి చేస్తానన్నారు.

భద్రాచలం - వరంగల్ మధ్యనే 'సింగరేణి'

గిర్మాజిపేట, జూన్ 15: వరంగల్ - బల్లార్ష రైల్వే మార్గంలోని ఆసిఫాబాద్ - రేచిణి మధ్య జరుగుతున్న మూడో లైను పనుల్లో భాగంగా ఈ మార్గంలో పలు రైళ్లను పాక్షికంగా రద్దు, దారి మళ్లింపు చేసినట్లు దక్షిణమధ్య రైల్వే శనివారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఇందులో భాగంగా ప్రతీ రోజు భద్రాచలం రోడ్డు (కొత్తగూడెం) నుంచి వరంగల్ మీదుగా బల్లార్ష వెళ్లే సింగరేణి ఫాస్ట్ ప్యాసింజర్ సోమవారం నుంచి జూలై 6 వరకు భద్రాచలం - వరంగల్ మధ్యే నడుస్తుందని పేర్కొంది. ప్రతీ రోజు మాదిరిగానే సింగరేణి ఉదయం 5.55 గంటలకు భద్రాచలం రోడ్డు నుంచి బయలుదేరి వరంగల్‌కు ఉదయం 8.44 గంటలకు చేరుకుంటుందని తెలిపింది. అలాగే వరంగల్ నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.20 భద్రాచలం రోడ్డు చేరుకుంటుందని పేర్కొంది. హైదరాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్ కాగజ్‌నగర్‌కు నడిచే హైదరాబాద్- సిర్పూర్‌కాగజ్‌నగర్, సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా సిర్పూర్‌కాగజ్‌నగర్ నడిచే సికింద్రాబాద్ - సిర్పూర్‌కాగజ్‌నగర్ రైళ్ల సోమవారం నుంచి జూలై 6 వరకు హైదరాబాద్ - కాజీపేట, సికింద్రాబాద్ - కాజీపేట మధ్యనే నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

అప్రమత్తతే ఆరోగ్య ఆయుధం

● వర్షాకాలంలో వ్యాధుల భయం ● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో నివారణ ● ప్రాథమిక దశలోనే చికిత్స పొందాలి



వరంగల్ మెడికల్, జూన్ 14: రానున్న కాలంలో సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం ఉంది. వర్షాకాలంలో నీటి నిల్వలు ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది అంటువ్యాధులు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. కలుషిత నీటివల్ల డయేరియా, అతిసారం వంటి వ్యాధులు విస్తృతంగా వస్తాయి. దీనికి తోడు దోమకాటు కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. వైద్య ఆరోగ్యశాఖ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు ప్రణాళిక రచించినప్పటికీ వ్యక్తిగతంగా ఎవరికి వారు కొన్ని నియమాలు తప్పక పాటించాల్సిన అవసరం ఉంది. సమాజ ఆరోగ్యం కోసం సమష్టిగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వైరల్ ఫీవర్ (విష జ్వరం)

వాతావరణంలో మార్పులు, కొన్నిరకాల వైరస్‌ల కారణంగా వైరల్ ఫీవర్ సోకుతుంది. ఇంట్లో ఒకరికి వస్తే మిగతా వారికి కూడా ఈ ఫీవర్ బారిన పడే అవకాశం ఉంది. ఈ జ్వరంలో రోగికి 103 నుంచి 107 ఫారిన్ హీట్ వరకు జ్వరం ఉంటుంది. గొంతు నొప్పి, జలుబు, ఆకలి మందగించడం, తలనొప్పి, ఒంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

మలేరియా

వర్షాకాలంలో దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో మలేరియా ప్రధానమైంది. దోమ కుట్టిన 10 నుంచి 14 రోజులలోపు అది లక్షణాలు బయట పడతాయి. రోజు విడిచి రోజు జ్వరం రావడం, తలనొప్పి, ఒంటి నొప్పులు, చలి ఎక్కువగా ఉంటుంది. చెమటలు పట్టడం, కొన్ని సార్లు వాంతులు కూడా వచ్చే అవకాశం ఉంది. జ్వరం వచ్చిన తొలి రోజునే మలేరియాను నిర్ధారించవచ్చునని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స పొందకపోతే కాలేయం. కిడ్నీ, గుండె, రక్తనాళాలపై ప్రభావం చూపి రోగి కోమాలోకి వెళ్లే ప్రమాదం కూడా పొంచి ఉంది.

డెంగీ

దోమ కుట్టిన వారం తర్వాత ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని పరిస్థితి ఎదురవుతుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పి వస్తుంది. కొందరి శరీరంపై పొక్కులు, దద్దుర్లు వంటివి వస్తాయి. వాంతులు, వికారం, రక్తంతో కూడిన మలవిసర్జన కనిపిస్తాయి. ఈ వ్యాధికారక వైరస్ రక్తంలో ఉత్పత్తి అవుతున్న ప్లేట్‌లెట్స్‌ను తినేస్తుంది. ఫలితంగా రక్తంలో ప్లేట్‌లెట్ సంఖ్య గణనీయంగా తగ్గి అంతర్గత రక్తస్రావం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు. నీటిపై ఉండే దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. అందుకే నిలువ ఉంచిన బిందెలను కచ్చితంగా మూతలు ఉంచాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచనల మేరకు మాత్రమే చికిత్స పొందాలి.

చికున్ గున్యా

డెంగీ కారక దోమకాటుతోనే చికున్‌గున్యా వ్యాధి సోకుతుంది. గున్యా వైరస్ బారిన పడిన వారిని కుట్టిన దోమ మరొకరికి కుట్టడం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుంది. ఈ రకమైన జ్వరం వచ్చి న వారికి ఒంటి నొప్పులు, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉండి కాళ్లు చేతుల్లో వాపులు కనిపిస్తాయి. మూడు నుంచి ఆరు నెలలపాటు ఈ నొప్పులు తగ్గవని వైద్యులు చెబుతున్నారు.

డయేరియా



కలుషిత నీరు, ఆహారం, నిల్వ ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల దయేరియా సోకుతుంది. వ్యాధిసోకిన వారికి నీళ్ల విరోచనాలు అవుతాయి. రోజుకు నాలుగు నుంచి ఐదుసార్లు విరోచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. అయితే రోగికి రోజులో పది నుంచి 20 సార్లు నీళ్ల విరోచనాలు అవుతాయి. వాంతులు కూడా ఎక్కువగా ఉంటాయి. కలుషితం వల్ల ఈ వ్యాధి సంభవిస్తుంది. కాబట్టి కుటుంబ సభ్యులతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలందరూ అనారోగ్యాని కి గురయ్యే అవకాశం ఉంటుంది. వ్యాధికి గురైన వారు బాగా నీరసించడం, సురుకు తగ్గిపోయి మాట్లాడలేకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

జాగ్రత్తలు

డయేరియా సోకిన రోగికి కాసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగించాలి. కొబ్బరినీళ్లు, మజ్జిగ, కొన్ని రకాల శీతల పానీయాలు ఇవ్వాలి. లీటర్ నీటికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు కలిపి మూడు నుంచి నాలుగు గంటలకు ఒకసారి తాగించాలి. ఈ సీజన్‌లో సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినకుండా ఉండటం మంచిది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తినవద్దు. విరేచనానికి వెళ్లి తర్వాత తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి.

విరోచనాలు

ఫుడ్ పాయిజన్ కారణంగా కొన్ని సమయాల్లో తీవ్రమైన కడుపునొప్పి వచ్చి రక్త విరోచనాలు అవుతాయి. రక్తంతో కూడిన విరోచనాలు కావడంతో రోగి భయపడే ఆస్కారం కూడా ఉంటుంది.

ఇంట్లో దోమలు ప్రబలకుండా చూసుకోవాలి

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గౌతమ్, జనరల్ మెడిసిన్ విభాగం, ఎంజీఎం ఆస్పత్రి



ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలి. శుభ్రమైన మంచినీటిని మాత్రమే తాగాలి. బయట పదార్థాలకు దూరంగా ఉండాలి. ఇంట్లో ఆహారం తినే ముందు కాళ్లు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో దోమలు వృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి ఆవరణలో పాత టైర్లు, తాగి పడేసిన కొబ్బరి బోండాలలో వర్షం నీరు నిలవడంతో దోమలు పెరుగుతాయి. దోమలు వ్యాప్తి చెందకుండా నివారించగలిగితే వ్యాధులు సోకే అవకాశం కూడా ఉండదు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

వరంగల్ ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీలత బదిలీ

నూతన ఆర్‌ఎంగా విజయభాను

బాలసముద్రం, జూన్ 15: వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత బదిలీ అయ్యారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ఆర్‌ఎం శ్రీలత రంగారెడ్డి జిల్లాకు బదిలీ కాగా, హైదరాబాద్‌లో చార్మినార్ డిప్యూటీ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాను వరంగల్ రీజినల్ మేనేజర్‌గా నియామకమయ్యారు. కాగా, 2022 నవంబరు 18న వరంగల్ రీజినల్ మేనేజర్‌గా శ్రీలత విధుల్లో చేరారు. మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ సేవలు అందించి ప్రజల నుంచి మన్ననలు పొందారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉమ్మడి జిల్లాలో విజయవంతంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

టెస్కాబ్ కార్యాలయంలో మార్నేనికి సన్మానం

హనుమకొండ సిటీ, జూన్ 15: తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావును ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సన్మానించారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రవీందర్‌రావు తొలిసారిగా శనివారం హైదరాబాద్‌లోని టెస్కాబ్ ప్రధాన కార్యాలయంలో తెలంగాణలోని డీసీసీ బ్యాంకుల చైర్మన్లు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ డిస్ట్రిక్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రియాజుద్దీన్, ప్రధాన కార్యదర్శి సర్వేశ్వరరావు, కోశాధికారి అభయ్‌కుమార్ తదితరులు మార్నేనికి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. పూలమాలలు, శాలువాతో సన్మానించారు.

మార్కెట్లో పనుల కోసం టెండర్ల ఆహ్వానం

వరంగల్ వ్యవసాయం, జూన్ 15: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని పలు పనుల నిర్వాహణ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రాము శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏనుమాముల మార్కెట్‌లో పల్లికాయ, పసుపు, పత్తి, మిర్చి, ధాన్యం, అపరాల యార్డులతోపాటు లక్ష్మీపురంలోని పాత, కొత్త మోడల్ కూరగాయల మార్కెట్‌లకు సంబంధించి జూలై 1 నుంచి 2025 మే 31 వరకు యార్డు క్లీనింగ్, పాన్ షాపులు, క్యాంటీన్ నిర్వాహణ, మరుగుదొడ్లకు సంబంధించి టెండర్లను ఆహ్వానించారు.

ఈ పనులు సంబంధించి మార్కెట్ కార్యాలయం పని వేళల్లో రూ.2000 చెల్లించి టెండర్ షెడ్యూల్ జూన్ 18 నుంచి 24 తేదీ వరకు పొందవచ్చని తెలిపారు. జూన్ 26న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లక్ష రూపాయల ఈఎండీ చెల్లించిన వారివి స్వీకరించబడునని, అదే రోజు సాయంత్రం 3 గంటలకు టెండర్లను తెరువబడుతాయని కార్యదర్శి ప్రకటనలో తెలిపారు.

ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెప్పారు..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి



ధర్మసాగర్ మండల కేంద్రంలో సీపీఐ జిల్లా శిక్షణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి.

ధర్మసాగర్, జూన్ 15: దేశంలోని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి శిక్షణా తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మోదీ పదేళ్ల పాలనలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి విభిన్నంగా పాలన జరిగిందన్నారు. దేశంలో ప్రశ్నించే గొంతులకను అణిచివేసి అనేక మందిపై అక్రమ కేసులు నమోదు చేసి జైలుకు పంపారని తెలిపారు. రైతులు, కార్మికులకు వ్యతిరేక చట్టాలు తెచ్చి ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టారన్నారు. చివరకు తెలంగాణకు రావాల్సిన విభజన హామీలను అమలు చేయకుండా మోసం చేశారన్నారు. దీంతోనే చావుతప్పి కన్ను లొట్టబోయిన విధంగా బీజేపీకి కేంద్రంలో మెజారిటీ రాలేదని తెలిపారు. టీడీపీ, జేడీయూ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. లోక్‌సభకు ఎన్నికైన వారిలో 259మంది నేరచరిత్ర గల వారు ఎంపీలుగా ఉన్నారని చెప్పారు. మంత్రి వర్గంలో కూడా నేర చరిత్ర ఉన్న వారితో నిండిపోయిందని ఆయన ఆరోపించారు. గతం కంటే ఇండియా కూటమి అధిక సీట్లు గెలిచి కేంద్రంలో ప్రతిపక్షంగా నిలిచిందన్నారు. వామపక్షాలు లేకుంటే ప్రజల మేలుకోరే చట్టాలు వచ్చేవి కావని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇష్టారీతిగా వ్యవరించడంవల్ల ప్రజలు ఇంటికి సాగనంపారని తెలిపారు. ప్రజలను విస్మరించి పాలన చేసిన వారికి ఇక్కట్లు తప్పవని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, రాజమౌళి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో ట్రాన్స్‌ఫర్స్ ఫీవర్

- బదిలీలపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో తెలియని పరిస్థితి
- మంచి స్థానం కోసం మొదలైన ముందస్తు పైరవీలు



రాంనగర్, జూన్ 15: రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ఫీవర్ ప్రారంభమైంది. నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుండటంతో శాఖ ఉద్యోగులు ముందస్తు పైరవీలకు తెరలేపారు. ఏ ప్రాతిపదికన బదిలీలు చేస్తారో ప్రభుత్వం నుంచి స్పష్టత రానప్పటికీ ఎవరి స్థాయిలో వారు పైరవీలకు శ్రీకారం చుట్టారు. సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు పుష్టిగా ఉన్నటువంటి స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. కింది స్థాయి ఉద్యోగులు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో స్థానం పొందేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత పదేళ్ల కాలంలో 2022లో కేవలం సబ్ రిజిస్ట్రార్‌లను ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బదిలీలు చేశారు. కింది స్థాయి ఉద్యోగులను పదేళ్ల నుంచి కదుపలేదు. కింది స్థాయి ఉద్యోగులకు పదేళ్లుగా పదోన్నతులు సైతం కల్పించలేదు. నగర ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విధులు నిర్వహించే వారు అన్ని రకాలుగా లబ్ధి పొందుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేవారు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. పదేళ్లుగా బదిలీల కోసం వేచి చూస్తున్న ఉద్యోగులు కోరుకున్న స్థానం కోసం లాబీయింగ్ చేస్తున్నారు.

స్పష్టత ఇవ్వని ప్రభుత్వం

రిజిస్ట్రేషన్ శాఖ బదిలీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. రెండేళ్ల కిందట సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు చేసిన గత ప్రభుత్వం.. 317 జీవో (జోన్ పరిధిలో) ప్రకారం ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాల వారిగా జాబితా తీసుకున్న ప్రభుత్వం.. పోస్టింగ్‌లు కేటాయిస్తూ జీవో జారీ చేసింది. ఈ జీవో ఆదారంగా సబ రిజిస్ట్రార్‌లు భద్రాద్రికొత్తగూడెం జోన్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల్లో పోస్టింగ్ పొందారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన బదిలీలను తప్పుపట్టినప్పటికీ ఎలా చేయబోతుందనే విషయమై స్పష్టత ఇవ్వలేదు. జీరో సర్వీసు తీసుకుంటుందా? రెండు లేదా మూడు సంవత్సరాల ఒకే స్థానంలో చేసిన సర్వీసును పరిగణలోకి తీసుకుంటుందా? జోన్, మల్టీజోన్ స్థాయిలో బదిలీలు చేస్తుందా? తెలియని పరిస్థితి. గత ప్రభుత్వం చేసినట్లు బదిలీల స్థానం కేటాయించి జీవో ఇస్తుందా? అనే ఆందోళన ఉద్యోగుల్లో ఉంది. ఒక వేళ మల్టీ జోన్ తీసుకుంటే గ్రేడ్-1 సబ్ రిజిస్ట్రార్‌లో కొమురంభీం, ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం జోన్‌ల పరిధిలోని జిల్లాలకు బదిలీ అవుతారు. నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి చేయనున్న ప్రభుత్వం ఇప్పటి వరకు ఉద్యోగుల వివరాల జాబితా సైతం తీసుకోలేదు. దీనితో అసలు ఈ శాఖలో బదిలీలు జరుగుతాయా? లేక మినహాయింపు ఇస్తారా అనే అనుమానాలు సైతం వ్యక్తం అవుతున్నాయి.

పోస్టింగ్‌ల కోసం ముందస్తు లాబీయింగ్

శాఖ ఉద్యోగులు మంచి పోస్టింగ్ కోసం ముందస్తు లాబీయింగ్ ప్రారంభించారు. జీరో సర్వీసుతో నేరుగా పోస్టింగ్ ఆర్డర్స్ వస్తాయనే ప్రచారం సాగుతుండటంతో పైరవీలు ముమ్మరం చేశారు. జోన్, మల్టీజోన్‌పై స్పష్టత రాకపోవడంతో ముఖ్యంగా సబ్ రిజిస్ట్రార్‌లు ఆర్థిక లావాదేవీలు అధికంగా ఉండే పోస్టింగ్‌ల కోసం ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం కొనసాగుతున్న ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బెటర్ స్థానం దక్కించుకునేందుకు మంత్రులు, ఎమ్మెల్యే వద్ద పడిగాపులు కాస్తున్నట్లు సమాచారం. బెటర్ పోస్టింగ్ కోసం ఎంతైనా ముట్టచెప్పేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. కాగా జీరో సర్వీసును పరిగణలోకి తీసుకుని బదిలీలు జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని 13 కార్యాలయాల పరిధిలో అన్ని క్యాడర్‌లకు చెందిన 96మంది (40 జూనియర్ అసిస్టెంట్లు, 21 అటెండర్లు, 3 క్యాషియర్లు, 1 టైపిస్టు, 14 సీనియర్ అసిస్టెంట్లు,14 సబ్ రిజిస్ట్రార్‌లు, 2 డీఆర్‌లు, 1 డీఐజి) స్థాన చలనం చెందే అవకాశం ఉంది.





ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలి

సంగెం, జూన్ 15 : మండలంలోని గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎంసీపీఐ పార్టీ నాయకులు సంగెం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, విద్యుత్ దీపాలు లేవని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, పాత భవనాలు ఉన్నచోట్ల విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మరుగుదొడ్లు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐ సంగెం మండల కార్యదర్శి ఇస్మాయిల్, గోనె రాంచందర్, అశోక్, దూడయ్య, శ్రీను పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలలో గీసుగొండ బెస్ట్



సురేష్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మంత్రి సీతక్క

గీసుగొండ, జూన్ 15: పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించి సకాలంలో చెల్లిస్తున్నందుకు గీసుగొండ మండల ప్రగతి సమాఖ్యను రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క అభినందించారు. శనివారం 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ యాక్షన్ ప్లాన్‌ను సామాజిక పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించింది. కార్యక్రమంలో ఏపీఎం సురేష్‌కు మంత్రి ప్రశంసా పత్రాన్ని అందించారు. గత ఆర్థిక సంవత్సరంలో మండల పొదుపు సంఘాలకు రూ. 30కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందాల్సి ఉండగా రూ.53 కోట్లను పొదుపు సంఘాలకు మండలసమాఖ్య అందించినట్లు సురేష్ తెలిపారు.

18 నుంచి పేరిణి ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న పేరిణి నాట్యాచార్యులు చాతరాజు నవ్యజ

పోచమ్మమైదాన్, జూన్ 15: తెలంగాణ ప్రభుత్వం-భాషా సాంస్కృతిక శాఖ, నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పేరిణి నాట్యం ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేరిణి నాట్యాచార్యులు చాతరాజు నవ్యజ తెలిపారు. వరంగల్ రామనాథపురిలోని పేరిణి నృత్యాలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ 18 నుంచి జూలై 17 వరకు పేరిణి నాట్యం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 12 నుంచి 35ఏళ్లలోపు వారు అర్హులని, ఆసక్తి కలిగినవారు 93930 04755, 70138 25078 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యక్షురాలు మోత్కురి చంద్రకళ, నాట్యాచార్యులు గజ్జుల రంజిత్‌కుమార్, కళాకారులు బండారి వైష్ణవి, మర్కాల లోహిత్, పల్నాటి శ్రీజ, తాడసం గురుదేవ్, బండారి తేజస్విని, సంతోష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, జూన్ 15: ఊకల్‌కు చెందిన మండల సాంబయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా వైస్ఎంపీపీ రడం శ్రావ్యభరత్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీరారావు, నాయకులు బోనాల అశోక్, వర్ధెల్లి సంపత్‌రావు, కొత్తగట్టు కోటి, మండల నరేష్, డోలె రాజేందర్, డక్క జయచంద్ర, రాజేశ్వర్‌రావు, కమలాకర్, రాజు పాల్గొన్నారు.

పార్క్‌లపై పట్టింపేది?

• అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న వైనం • కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలాలు, పార్కులు •కాలనీల్లో కరువైన మౌలిక వసతులు • 18వ డివిజన్‌పై పాలకుల చిన్నచూపు

ఖిలావరంగల్, జూన్ 15: నగరంలోని క్రిస్టియన్‌కాలనీలో అనేక పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. 18వ డివిజన్ క్రిస్టియన్‌కాలనీ, గాంధీనగర్, ప్రతాప్‌నగర్, ఎస్ఆర్‌టీ, టీఆర్‌టీకాలనీలలో మొత్తం 32 ప్రభుత్వ స్థలాలు, పార్కులున్నాయి. స్థానికులకు వాటర్ ట్యాంక్‌లు, కమ్యూనిటీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఓపెన్ జిమ్ సెంటర్, అంబేద్కర్ భవనం తదితర అవసరాలకు 17 పార్కు స్థలాలు పోగా, మరో 15వరకు ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఉన్నాయి. అధికారుల పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి అలంకారప్రాయంగా మారాయి.

యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు..

క్రిస్టియన్‌కాలనీలోని పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ స్థలాలలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. స్థానిక ప్రాంతంలోని యువకులు పార్కులలో రాత్రులు మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తూ స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. పదేళ్ల క్రితం నర్సంపేట రోడ్‌కు సమీపంలో వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు పబ్లిక్, పిల్లల పార్కులను ప్రారంభించారు. అందులో పిల్లలకు సంబంధించిన జారుడు బల్లలు, ఊయళ్ళు, గ్లోబు, కొలంబస్, తదితర ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. పబ్లిక్, పిల్లల పార్కులకు సిబ్బందిని ఏర్పాటు చేయక పోవడంతో ఆట వస్తువులు, గేట్, చివరకు గ్రిల్స్‌కు ఉన్న ఇనుప వస్తువులు సైతం లేకుండా పోయాయి.

కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలాలు

రెండు దశాబ్దాలుగా క్రిస్టియన్‌కాలనీలో పబ్లిక్ పార్కులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. అయినా రెవెన్యూ, కుడా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. రాజకీయ చోటా, మోటా నాయకులు, సమీపంలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. క్రిస్టియన్‌కాలనీలోని ప్రభుత్వ స్థలాలు, పార్కులు, కమ్యూనిటీ భవనాలను తప్పుడు పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేయించుకున్న దాఖలాలు సైతం తెరమీదికి వచ్చాయి. అప్పుడు రెవెన్యూ, కుడా అధికారులు వచ్చి, ప్రభుత్వ స్థలాల్లో స్థలం కుడా ఆధీనంలో ఉంది. ఈ స్థలంలో ఎవరికి, ఎలాంటి హక్కులు లేవని బోర్డులు పెట్టారు.



నిరుపయోగంగా మారిన మినరల్ వాటర్ ప్లాంట్, మినీ వాటర్ ట్యాంక్‌లు



కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలం

శిథిలావస్థలో మినరల్ వాటర్ ప్లాంట్

క్రిస్టియన్‌కాలనీ సీబీసీ చర్చి సమీపంలో ఉన్న వాటర్‌ప్లాంట్ శిథిలావస్థలో ఉంది. స్థానిక 18వ, డివిజన్ ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు 2013 నవంబరు 2న, అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వెనకబడిన తరగతుల (బీసీ)సంక్షేమ శాఖామంత్రి బస్వరాజు సారయ్య, అప్పటి ఎంపీ సిరిసిల్ల రాజయ్య చేతుల మీదుగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వరంగల్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్, ఫిల్టర్ మిషన్, విద్యుత్ సరఫరా, పైపులు తదితర ఏర్పాట్లను పూర్తి చేశారు. కానీ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం కాకుండానే నిలిచిపోయింది. గత 11 సంవత్సరాలుగా మినరల్ వాటర్ ప్లాంట్ నిరుపయోగంగా మిగిలిపోయింది.



క్రిస్టియన్‌కాలనీలో పాడైన పిల్లల పార్కు ఆట వస్తువులు

నిలిచిపోయిన కమ్యూనిటీ భవనం నిర్మాణం

క్రిస్టియన్‌కాలనీ చర్చి వెనకాల కమ్యూనిటీ భవనం ఏర్పాటు కోసం అప్పటి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ శంకుస్థాపన చేశారు. ఆ స్థలంలో పబ్లిక్ టాయిలెట్స్, లెట్రిన్స్, వాటర్‌ట్యాంక్, బోర్, సెంటర్‌లైట్‌ను ఏర్పాటు చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా క్రిస్టియన్ కమ్యూనిటీ భవనం పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిధులు కేటాయించి నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్, లెట్రిన్స్, బోర్ పని చేయకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి.

పోలీసులు పెట్రోలింగ్ చేయాలి



క్రిస్టియన్‌కాలనీ, ఓసిటీ గ్రౌండ్, గాంధీనగర్, ప్రతాప్‌నగర్, లేబర్‌కాలనీ, తెలంగాణ జంక్షన్, నర్సంపేటరోడ్, తదితర ప్రాంతాల్లో కొంతమంది యువకులు అర్ధరాత్రి బర్త్‌డేల పేరుతో కేక్‌లు కట్ చేసి, బాణాసంచా కాల్చి హంగామా చేస్తున్నారు. మద్యం మత్తులో బైక్‌లతో శబ్దాలు చేస్తూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులు రాత్రివేళ గస్తీ నిర్వహించాలి. - కొల్లూరి సుధీర్, క్రిస్టియన్‌కాలనీ

ఎగ్‌కార్ట్స్ స్కీమ్‌తో యువతకు ఉపాధి



లబ్ధిదారులకు ఎగ్ కార్ట్స్‌ను అందజేస్తున్న ప్రదీప్‌రావు

మిల్స్‌కాలనీ, జూన్ 15: నెక్ జాతీయ అధ్యక్షురాలు అనురాధ దేశాయ్ డ్రీమ్ ప్రాజెక్టు అయిన ఎగ్ కార్ట్స్ స్కీమ్‌తో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని నెక్ జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శనివారం ఓసిటీలోని ఆయన నివాసంలో 50మంది లబ్ధిదారులకు ఎగ్‌కార్ట్‌లను అందజేశారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ వరంగల్ యువతకు ఉపాధి కల్పించాలనే తపనతో జాతీయ అధ్యక్షురాలిని ఒప్పించి వరంగల్‌లో మొత్తం 500కార్ట్స్‌ను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. స్వయం ఉపాధితో జీవనోపాధిని పొందాలనుకునే వారు ఎలాంటి పైరవీలు లేకుండా సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నెక్ ప్రతినిధులు డాక్టర్ అన్నామలై, ఎజిల్ కుమార్, వరంగల్ జోనల్ కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ పౌల్ట్రీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, టీపీఎఫ్ వరంగల్ రీజియన్ ప్రెసిడెంట్ రామారావు, డబ్ల్యుపీఎఫ్ఏ ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, కోశాధికారి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గీసుగొండ, జూన్ 15: ధర్మారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, స్టేషనరీ వస్తువులను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కాశిబుగ్గ శాఖ శనివారం అందచేశారు. గ్రామంలోని వీధి వ్యాపారులకు గొడుగులు, తోపుడుబండ్లను, కీర్తినగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయానికి మైక్‌సెట్‌ను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం, తోట వైద్యనాథ్, ఆర్‌సీ రాజేష్‌కుమార్, కరుణాకర్, క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ సంపత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి రమేష్, కార్యదర్శి వీరభద్రయ్య, కోశాధికారి మురళీధర్, శ్రీకాంత్, శరత్, భద్రయ్య, మోహన్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

వృద్ధులతో గౌరవంగా ప్రవర్తించాలి

పోచమ్మమైదాన్, జూన్ 15: వృద్ధులతో గౌరవంగా, మర్యాదగా ప్రతీ నడుచుకోవాలని జిల్లా సాంఘిక, సంక్షేమ శాఖ అధికారి హైమావతి అన్నారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కొత్తవాడలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హైమావతి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. వృద్ధులపై వేధింపుల నివారణకు కుటుంబ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. వివిధ సంస్థలు, ఆస్పత్రులు, పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ సంస్థలు బాధ్యతగా వ్యవహరిస్తూ వారికి గౌరవం పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, లీగల్ ఎయిడ్ సర్వీస్ కౌన్సిలర్ సురేష్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సదానందం, కార్యనిర్వాహణాధికారి నన్నపునేని సంజీవరావు, కందుల గోవర్ధన్, తాళ్ల ఉమాదేవి, మల్లిక, వెంకటమల్లు, గుర్రం నర్సింహరాములు, అడెపు రాజేంద్రప్రసాద్, దొమ్మెటి రాజమౌళి పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న హైమావతి

పెద్ద చెరువు వరద కాల్వ నిర్మించాలి

సంగెం, జూన్ 15 : మామునూరు గ్రామ పెద్ద చెరువు వరద కాల్వకు ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుకు శనివారం 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ వినతి పత్రం సమర్పించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వినతి సమర్పించారు. గ్రామాల్లో సైడు కాల్వలు, సీసీ రోడ్లు, వంటి సమస్యల పరిష్కారానికి సుమారు రూ.4 కోట్ల నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కార్పొరేటర్ అరుణ విక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు ఈదురు విక్టర్, అకినపల్లి స్పందన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇస్తున్న కార్పొరేటర్

వాతావరణ మూలకాలపై శిక్షణ



సేద్య విభాగం శాస్త్రవేత్తలతో ఉమారెడ్డి

వరంగల్ వ్యవసాయం, జూన్ 15: వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం సమావేశ మందిరంలో శనివారం వాతావరణ పరిశీలనా కేంద్రంలోని వివిధ రకాల వాతావరణ మూలకాల పనితీరు, డేటా సేకరణపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. మధ్య తెలంగాణ మండల పరిధిలోని పరిశోధనా స్థానాల నుంచి సేద్య విభాగం శాస్త్రవేత్తలకు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా వరంగల్ ప్రాంతీయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు ఆర్.ఉమారెడ్డి హాజరై వాతావరణ మూలకాలైన వర్షపాతం, పగలు రాత్రి ఉష్ణోగ్రత, గాలిలో తేమ, సూర్యరశ్మి, గాలి వేగం, గాలి దిశ, నీటి బాష్పోచ్ఛకంపై వివరించారు. వ్యవసాయ పరిశోధనా కేంద్రం రాజేంద్రనగర్ నుంచి డాక్టర్, ఎస్‌జి మహదేవప్ప వాతావరణ మూలకాలపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మధు, నాగభూషణం, భరత్, మాధవి, శ్వేత, డాటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

బొడ్రాయికి జలాభిషేకం

గీసుగొండ, జూన్ 15: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు అవుతున్నా, వర్షాలు పడక పోవడంతో ఎలుకుర్తి గ్రామస్థులు గ్రామదేవత(బొడ్రాయి)కి శనివారం జలాభిషేకాలు చేశారు. నైరుతి పవనాలు వస్తున్నాయని ఆశతో విత్తనాలు నాటిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పత్తి విత్తనాలు నాటిన నీరులేక మొలకెత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

'తూర్పు ప్రజలు మోదీ నాయకత్వాన్ని బలపరిచారు'



రవీందర్‌ను సత్కరిస్తున్న ప్రదీప్‌రావు

శంభునిపేట, జూన్ 15: వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజలు ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరిచారని బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. 41వ డివిజన్ విశ్వనాథకాలనీలో శనివారం జరిగిన బీజేపీ నాయకులు కర్నె రవీందర్ జన్మదిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ప్రదీప్‌రావు పాల్గొని రవీందర్‌ను సత్కరించారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేశారని అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కందిమళ్ళ మహేష్, సిద్ధం నరేష్, మంద శ్రీనివాస్, బోరిగం నాగరాజు, ఆకుతోట రాజు, తాళ్ళపల్లి అర్జున్, కర్నె వాసుదేవ్, బక్కి రంజిత్, ఆరె కార్తిక్, సంజీవ్, గోపి, నాగరాజు, భిక్షపతి పాల్గొన్నారు.



రంగశాయిపేట బొడ్రాయి వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

అయ్యప్ప భక్తుల ఆధ్వర్యంలో అన్నదానం

శంభునిపేట, జూన్ 15 : అయ్యప్ప స్వామి జన్మనక్షత్రం అయిన ఉత్తర నక్షత్రం సందర్భంగా శనివారం రంగశాయిపేట బొడ్రాయి వద్ద అయ్యప్ప భక్తులు మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. రంగశాయిపేట అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రంగశాయిపేట గ్రామదేవత (బొడ్రాయి)కి పూజలు చేశారు. రంగశాయిపేటలోని అయ్యప్ప భక్తులు వాట్సాప్ గ్రూపుగా ఏర్పడి ప్రతీ నెల ఉత్తర నక్షత్రం రోజున ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో గురుస్వాములు నల్లతీగల వెంకన్న, బూర సంతోష్, కత్తెరపల్లి వేణు, రాజు, అడుప వేణు, పాకనాటి శ్రీనివాస్, కొల్లూరి యోగానంద్, మండల నరసింహారాములు, నవీన్ ఆడెపు రఘు, పాకాల మనోహర్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సుల సీజ్

ఖిలావరంగల్, జూన్ 15 : నగరంలో ఆర్టీఓ ఎంవీఐ జయపాల్‌రెడ్డి స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. శనివారం కాశిబుగ్గలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులను లైసెన్సు, ఫిట్‌నెస్ పత్రాలను తనిఖీలు చేశారు. ఓ పాఠశాల బస్సుకు నాలుగేళ్ల నుంచి ఫిట్‌నెస్ లేకున్నా విద్యార్థులను తరలిస్తుండడంతో సీజ్ చేశారు. వరంగల్ ప్రాంతంలో మరో రెండు బస్సులకు ఫిట్‌నెస్ లేకపోవటంతో వాటిని కూడా సీజ్‌చేశారు. కార్యక్రమంలో ఆర్టీఓ జయపాల్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



కాశిబుగ్గలో ఫిట్‌నెస్ లేని బస్సులను తనిఖీ చేస్తున్న జయపాల్‌రెడ్డి

తండ్రి మందలించాడని ఆత్మహత్య

శంభునిపేట, జూన్ 15 : తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం నగరంలో చోటుచేసుకుంది. మామునూరు పోలీసుల కథనం ప్రకారం. మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లోని పాత క్వార్టర్స్‌లో షౌకత్ అలీ తన భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. కుమారుడు యాసర్ అరాఫత్ (23) డిగ్రీ మధ్యలో ఆపేసి, మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఎందుకు తాగుతున్నావు, ఏదైనా పని చేసుకోవచ్చు కదా అని తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన అరాఫత్ అర్ధరాత్రి మద్యం మత్తులో గదికి తలుపు పెట్టుకొని ఇంట్లో ఉరి వేసుకున్నాడు. శనివారం ఉదయం ఎంతకు గదిలో నుంచి రాకపోవటంతో తండ్రి కిటికీ తలుపులు తీసి చేసే సరికి ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న మామునూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. తండ్రి షౌకత్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు.

నిషేధిత పొగాకు విక్రయిస్తే కఠిన చర్యలు

వరంగల్ చౌరస్తా, జూన్ 15: నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్ సీఐ మచ్చ శివకుమార్ హెచ్చరించారు. శనివారం వరంగల్ రైల్వే స్టేషన్, బస్టాండ్, కాశిబుగ్గలో పాన్‌షాపులు, కిరాణం షాపుల్లో తనిఖీ చేసినట్టు వెల్లడించారు. ఎవరూ నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దని సూచించారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేతలు



కేసీఆర్‌ను కలిసిన వరంగల్ నేతలు

రాంనగర్, జూన్ 15: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను వరంగల్ జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితిని కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకుండా పార్టీ పటిష్టత కోసం పని చేయాలని కేసీఆర్ సూచించినట్లు నేతలు తెలిపారు.

డీఎస్సీని వాయిదా వేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: డీఎస్సీని వాయిదా వేసి అభ్యర్థులు సన్నద్ధం అయ్యేందుకు మూడు నెలలు గడువును ఇవ్వాలని బీఎస్ఎఫ్ కేయూ ఇంచార్జి బొట్ల మనోహర్ అన్నారు. డీఎస్సీని వాయిదా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం కేయూ లైబ్రరీ ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇటీవలే విడుదల చేసిన టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు డీఎస్సీకి ప్రిపేర్ అయ్యేందుకు మూడు నెలల తర్వాతనే డీఎస్సీని నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల తర్వాత ఖాళీ అయిన 26 వేల పోస్టులను డీఎస్సీలో కలిపి మూడు నెలల తర్వాత డీఎస్సీని నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మహేందర్, ప్రవీణ్, భరత్, రాధిక, కవిత, నరేష్, కార్తీక్ పాల్గొన్నారు.

సేవకు గుర్తింపు తప్పకుండా లభిస్తుంది

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 15: నిస్వార్థ సేవకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని కేయూ ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. ఉత్తమ ప్రజా సేవా అవార్డును అందుకున్న లక్ష్మీనారాయణను శనివారం ఎస్డీఎల్‌సీఈలో సత్కరించారు. కార్యక్రమంలో కేయూఅధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత



పిల్లలకు నోటుబుక్స్, యూనిఫాంలు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ

పోచమ్మమైదాన్, జూన్ 15: వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన తల్లి, తండ్రి లేని ఇద్దరు పిల్లలకు కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ చేయూతనందిచి, వారిని పాఠశాలలో చేర్పించారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన సాయి అద్విత్, శ్రీశాన్వి ఇద్దరు పిల్లలు అమ్మమ్మ ఓల్ల జ్యోతి వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు శనివారం కాంగ్రెస్ నాయకుడు బొల్లం శివ ఇద్దరు పిల్లలకు నోట్‌బుక్స్ యూనిఫాంల కోసం రూ. పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా యాజమాన్యంతో మాట్లాడి ఫీజు లేకుండా పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఇనుగుల బాబు, సిలువేరు శ్రీను, దూలం పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మట్టెవాడ, జూన్ 15: ప్రయివేట్ స్కూళ్లలో ఫీజులు నియంత్రించి, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్ అన్నారు. శనివారం వరంగల్ మండల కేంద్రంలో ఉన్న విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్‌కు ఏఐఎస్ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మౌటం శివకుమార్, సంతోష్, మేకల అభిరామ్, ప్రభాస్, రాజు, సాయి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 16 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవో కార్యాలయంలో ఉద్యోగికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట, జూన్ 15 : జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఉద్యోగి భరత్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో తరగతి గదుల కొరత, ఉపాధ్యాయుల కొరతను వెంటనే తీర్చి విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. నర్సంపేట డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీచేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అందించాలని కోరారు. కార్యక్రమంలో సిద్ధూ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు



పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ నర్సయ్య

రాయపర్తి జూన్ 15 : చట్టాన్ని అతిక్రమించి ప్రవ ర్తించే వ్యక్తులు, వ్యవస్థలపై కఠిన చర్యలు తప్పవని వర్ధన్నపేట ఏసీపీ అంబాటి నర్సయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం సీఐ సూర్య ప్రకాశ్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ఆరంభంలో భూ సమస్యలు సాధారణంగా వస్తుంటాయని, భూ యజమానులు భూ సరిహద్దులు విస్తీర్ణంలో తేడాలు పట్టాల మార్పిడి వంటి సమస్యలను గ్రామ పెద్దల సమక్షంలో శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశాలకులోనై విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మండలంలోని అన్ని గ్రామాలలో పొగాకు ఉత్పత్తులు అయిన అంబర్లు, గుట్కాలు, క్రయ విక్రయాలపై పోలీసు నిఘా పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత వస్తువుల వ్యాపారాలు, బెల్టుషాపులు, గుడుంబా విక్రయాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపనున్నట్లు ఆయన చెప్పారు. మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల సమాచారాన్ని ప్రజలు పోలీసు శాఖకు చేరవేర్చాలని ఆయన కోరారు. సమావేశంలో వడ్డె సందీప్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కోనాపురంలో ప్రధాన రహదారిపై స్తంభాలను తొలిగించకుండానే వేసిన రోడ్డు

చెన్నారావుపేట, జూన్ 15 : మండలంలోని కోనాపురంలో సీసీ రోడ్డుపైన ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకుండానే సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడం పట్ల గ్రామస్థులతో పాటు పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కోనాపురం- ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారికి ఇటీవల డబుల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. రోడ్డుపైన విద్యుత్ స్తంభాలను సంబంధిత అధికారులు తొలిగించకుండానే సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేశారు. ఆదే రోడ్డుకు సుమారు 5 నుంచి ఆరు స్తంభాలు రోడ్డుపైననే ఉండటంతో వచ్చే పోయే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే భారీ వాహనాలు వచ్చినప్పుడు ఏదైన ప్రమాదం జరిగే ప్రమాదం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని విద్యుత్ స్తంభాలను తొలిగించాలని పలువురు కోరుతున్నారు.

ఇటుకబట్టీ వ్యాపారుల ఆగడాలు అడ్డుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

వర్ధన్నపేట, జూన్ 15 : ఇటుక బట్టీలకు తమ పంట భూముల్లోని నల్లమట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యాపారులను అడ్డుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు అంబేడ్కర్‌నగర్ గ్రామ దళిత రైతులు బి.దానయ్య, సిహెచ్.రాజు, జె.జోసఫ్, సిహెచ్‌బాబు, ఎం.రాజు, చాడ, టి.అనిల్, జి.రమేష్, ఎం.ఆరోగ్యం, టి.శివ తదితరులు వినతిపత్రం శనివారం అందజేశారు. బాధిత రైతులు మాట్లాడుతూ గత వందేళ్లుగా 2153సర్వే నెంబర్‌లోని భూములను తాము పంటలుసాగు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని కానీ ప్రస్తుతం తమ భూముల్లోని సారవంతమైన నల్లమట్టిని తమ మండలంకాని వ్యక్తులు, వ్యాపారస్తులు ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్నారు. ఇందేటని ప్రశ్నిస్తే తమకు ప్రభుత్వం నుంచి అనుమతులున్నాయని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2153సర్వే నెంబర్‌లోని మట్టిని తరలిస్తే పంటలు పండవని, మట్టిని తరలించకుండా నిలుపుదలచేసి తమకు న్యాయంచేయాలని తహసీల్దార్‌ను కోరారు.

పెద్ద చెరువు వరద కాల్వ నిర్మించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

సంగెం, జూన్ 15 : మామునూరు గ్రామ పెద్ద చెరువు వరద కాల్వకు ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మించాలని వర్ధన్న పేట ఎమ్మెల్యే నాగరాజుకు శనివారం 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్ వినతి పత్రం సమర్పించారు. హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వినతి సమర్పించారు. గ్రామాల్లో సైడు కాల్వలు, సీసీ రోడ్లు, వంటి సమస్యల పరిష్కారానికి సుమారు రూ.4 కోట్ల నిధులు కేటాయించి, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కార్పొరేటర్ అరుణ విక్టర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు ఈదురు విక్టర్, ఆకినపల్లి స్పందన్ పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!

- శిథిలావస్థలో సహకార భవనాలు, గోదాములు
- సేవలందక రైతుల అవస్థలు
- ఆక్రమణకు గురవుతున్న సొసైటీ స్థలం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పెర్కవేడులో శిథిలావస్థకు చేరుకున్న సహకార భవనం



తిర్మలాయపెల్లిలో శిథిలావస్థలో ఉన్న సొసైటీ భవనం

రాయపర్తి, జూన్ 15 : రైతులకు సేవలందించడానికి నిర్మించిన సహకార భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని 39 గ్రామాల రైతులకు సేవలందించడానికి రాయపర్తి, పెర్కవేడు, తిర్మలాయపెల్లి, కొలన్‌పెల్లి, కిష్టాపురం గ్రామాల్లో గతలో సహకార భవనాలు నిర్మించారు. రాయపర్తి, కొలన్‌పెల్లి గ్రామాల్లోని భవనాల్లో క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేసి రైతులకు సేవలందిస్తున్నారు. కానీ, పెర్కవేడు, తిర్మలాయపెల్లి, కిష్టాపురం గ్రామాల్లోని సహకార భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని, కూలిపోయే దశకు వచ్చాయి.

సేవలందక రైతుల అవస్థలు...

అరకొర భవనాలతో గ్రామీణ ప్రాంత రైతులకు సేవలు సరిగ్గా అందకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో ఎరువుల నిల్వలకు ఇబ్బందిగా మారడంతో ప్రైవేటు భవనాలు అద్దెకు తీసుకుని నిల్వచేస్తున్నారు. రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న సహకార కేంద్రాలు వాటిని నిల్వచేసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాయి. వరిధాన్యం ప్రతి ఏటా పెరిగి ధాన్యం వస్తున్నప్పటికీ వాటిని నిల్వచేసే గోదాములు సరిగ్గాలేవని రైతులు చెపుతున్నారు.

మండల కేంద్రంలో నిర్మిం చిన గోదాం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదు. దీంతో ఎరువుల నిల్వలకు, ధాన్యం నిల్వలకు ఇబ్బంది లు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఆక్రమణకు గురవుతున్న సొసైటీ స్థలం...

రైతులకు సేవలందించడానికి మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన సహకార భవనాలు నేడు శిథిలావస్థకు చేరడంతో ఆక్రమణకు గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలోని పెర్కవేడు గ్రామంలో 0.18 గుంటల భూమిలో గోదాము నిర్మించినప్పటికీ వాడుకలోకి రాకపోగా, కూలిపోయే దశకు చేరుకుంది. అందులో ప్రైవేటు వ్యాపారస్థులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ధాన్యం నిల్వలు ఉంచుతున్నారు. వీటిలో కొంత చుట్టూ పక్కల స్థలం అన్యాక్రాంతానికి గురైనట్లు స్థానికులు చెపుతున్నారు. ఇక తిర్మలాయపెల్లి గ్రామంలోని 0.20 గుంటల భూమిలో నిర్మించిన సహకార భవనం శిథిలావస్థకు చేరుకోగా, చుట్టూ స్థలం నిరుపయోగంగా మిగిలిపోయింది. సుమారు రూ.50 లక్షలు విలువ చేసే భూమిని చుట్టూ ప్రహరీ గోడలేకపోవడంతో అన్యాక్రాంతానికి గురవుతోంది. మరికొంత స్థలంలో వాటర్ ట్యాంక్ నిర్మించారు.

నూతన గోదాములు నిర్మించాలి...

బండపల్లి యాకయ్య, రైతు, పెర్కవేడు



పెర్కవేడులో 30ఏండ్ల క్రితం నిర్మించిన వ్యవసాయ గోదాము పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. చుట్టూ ప్రహరీ గోడలేక స్థలం అన్యాక్రాంతానికి గురవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన గోదాములు నిర్మించి రైతులకు అందుబాటులోకి తేవాలి.

ప్రహరీ నిర్మించాలి...

చెరుకూరి నాగేశ్వర్‌రావు, రైతు, కొత్తూరు



లక్షలాది రూపాయాల విలువ చేసే సహకార భవనాల స్థలాలను కాపాడడానికి చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించాలి. రైతులకు సౌకర్యం కోసం నూతన భవనాలు నిర్మించి క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేయాలి. రైతులు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక లావాదేవీలు చేసుకోవడానికి వీలు కల్పించాలి.

వృద్ధులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలి



నర్సంపేటలో మాట్లాడుతున్న నల్ల మనోహర్‌రెడ్డి

నర్సంపేట, జూన్ 15 ! వృద్ధులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రపంచ వృద్ధుల వేధింపుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధులను ఎవరైనా వేధింపులకు గురిచేస్తే అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకుంటారన్నారు. వృద్ధుల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం తమ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 14267కు సమాచారం అందించాలని వృద్ధులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, మేరుగు లక్ష్మన్‌బాబు, కోదాటి వీరస్వామి, వడ్లకొండ సాంబయ్య, పొగుళ్ళ భూపాల్‌రెడ్డి, మల్లయ్య, ఈశ్వరమూర్తి, లింగయ్య, సత్యం అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

• చెన్నారావుపేట: వయోవృద్ధులను సమాజంలో అగౌరవ పరుచవొద్దని వయోవృద్ధుల సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బస్టాండ్ సెంటర్ నుంచి బ్యాంకు వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పౌరులు రానున్న రోజుల్లో వృద్ధులు అవుతారన్నారు. వృద్ధులను ప్రతీ ఒక్కరూ గౌరవించాలన్నారు. వృద్ధులను ఇబ్బందులు పెట్టకుండా మంచిగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ హెచ్‌ఎం వరంగంటి కుమారస్వామి, వరంగంటి మల్లయ్య, కొమ్మాలు. సంజీవరెడ్డి, కృష్ణ, కంది నారాయణరెడ్డి, పర్కాల కొంరయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా దందాలో బూతుల పురాణం



జేసీబీతో ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న ఇసుక

వర్ధన్నపేట, జూన్ 15 : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గ్రామాల నుంచి ఇసుకను జేసీబీలతో అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తులు సమన్వయ లోపంతో ఒకరిపై మరొకరు పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఫిర్యాదులు చేసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో అసభ్యపదజాలంతో దూషించుకుంటున్న సంభాషణలు చక్కర్లు కొడుతున్నాయి. ఆకేరు పరివాహక ప్రాంతాలైన ఇల్లంద, ల్యాబర్తి, కొత్తపల్లి, వర్ధన్నపేట తదితర గ్రామాల నుంచి ప్రతీరోజు వందలాది ట్రాక్టర్ల ఇసుక వరంగల్ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా అవుతుంది. పోలీసు, రెవెన్యూ అధికారుల అండదండలతో వ్యాపారులు, దళారులు సాగిస్తున్న దందా మూడుపూలు ఆరుకాయలుగా కొనసాగుతుంది. ఈ క్రమంలో ల్యాబర్తిలో ఇసుకను జేసీబీ సహాయంతో తోడుతున్న ఓ వ్యక్తి మరో జేసీబీ యజమానితో నేనొక్కడినే ఈ పని చేస్తున్నానా? 10 జేసీబీలు నడుస్తున్నాయి. ఎవరికి ముట్టాల్సింది వారికి ముట్టజెబుతున్నా మాపై చెప్పుడు మాటలతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అసభ్యపదజాలంతో దూషించడంతో వాట్సప్‌ల్లో వైరల్ అవుతుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మిన్నకుండి పోవడం పట్ల ప్రజలు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన జ్యోతిరావుపూలే విద్యార్థి



విద్యార్థి సర్వనేత్రను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుగ్గొండి, జూన్ 15 : మండలంలోని గిర్నిబావికి చెందిన మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి కె.సర్వనేత్ర మేధా చారిటబుల్ ట్రస్టు హైదరాబాద్ వారు నిర్వహిం చిన స్కాలర్‌షిప్ ప్రోగ్రాంకు ఎంపికైనట్లు శనివారం ప్రిన్సిపాల్ దేవేందర్ వెల్లడించారు. 2024 ఏప్రిల్ 21న నిర్వహించిన ప్రతిభ పోటీలలో 1100మంది ప్రభు త్వ పాఠశాలలలో చదువుచున్న విద్యార్థులు పాల్గొనగా, సర్వనేత్ర పాల్గొ ని ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఉపాధ్యాయులు సురేశ్, ప్రభాకర్, రాజు, కోటి, కిరణ్, బషీర్, సునీత, అనితలు విద్యార్థి సర్వనేత్రను అభినందించారు.

మిషన్ భగీరథ తాగు నీరు అందించాలి



తాగునీటి నల్లాను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేదవతి

చెన్నారావుపేట, జూన్ 15 : మిషన్ భగీరథ తాగు నీటిని ఇంటింటికి అందించడానికి మరింత వేగవంతం చేయాలని డీఎల్‌పీవో వేదవతి అన్నారు. శనివారం మండల కేంద్రం పాటు అమీనాబాద్ గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి కనెక్షన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటికి తాగు నీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి సరఫరాను అందిస్తున్న నల్లాల పనితీరును ఇంటింటికి తిరుగుతూ గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ కనెక్షన్‌లేని ఇంటిని గుర్తించి సంబంధిత వారికి తాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శులు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్థులు

గీసుగొండ, జూన్ 15 : ఖరీఫ్ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు అవుతున్నా, వర్షాలు పడకపోవడంతో ఎలుకుర్తి గ్రామస్థులు గ్రామదేవత (బొడ్రాయి)కి శనివారం జలాభిషేకాలు చేశారు. నైరుతి పవనాలు వస్తున్నాయని ఆశతో దుక్కులు దున్ని, సాగుచేసి విత్తనాలు నాటిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పత్తి విత్తనాలు నాటిన నీరులేక మొలకెత్తకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట, జూన్ 15 : ద్విచక్ర వాహనాన్ని వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన వర్ధన్నపేట పట్టణ శివారులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పోలిపల్లి రాజు, ప్రవంతి అనే ఇద్దరు ద్విచక్ర వాహనంపై జఫర్‌గఢ్ వైపు వెళుతుండగా వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు, ప్రవంతిలు గాయపడగా వారికి వర్ధన్నపేట సీహెచ్‌సీకి చికిత్సనిమిత్తం తరలించారు.

విద్యార్థులకు నోట్‌బుక్‌ల పంపిణీ

గీసుగొండ, జూన్ 15: ధర్మారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్‌లు, స్టేషనరీ వస్తువులను వాసవి క్లబ్ ఇంటర్నేషల్ కాశిబుగ్గ శాఖ శనివారం అందచేశారు. గ్రామంలోని వీధి వ్యాపారులకు గొడుగులు, తోపుడుబండ్లను, కీర్తినగర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయానికి మైక్‌సెట్‌ను అందించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ ప్రెసిడెంట్ మడిపల్లి భాస్కరం, తోట వైద్యనాథ్, ఆర్‌సీ రాజేష్‌కుమార్, కరుణాకర్, క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ సంపత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి రమేష్, కార్యదర్శి వీరభద్రయ్య, కోశాధికారి మురళీధర్, శ్రీకాంత్, శరత్, భద్రయ్య, మోహన్‌రావు, నారాయణ పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ రుణాలలో గీసుగొండ బెస్ట్



సురేష్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న మంత్రి సీతక్క

గీసుగొండ, జూన్ 15: పొదుపు సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇప్పించి సకాలంలో చెల్లిస్తున్నందుకు గీసుగొండ మండల ప్రగతి సమాఖ్యను రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క అభినందించారు. శనివారం 2024-25 ఆర్థిక సంవత్సర వార్షిక బడ్జెట్ యాక్షన్ ప్లాన్‌ను సామాజిక పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించింది. కార్యక్రమంలో ఏపీఎం సురేష్‌కు మంత్రి ప్రశంసా పత్రాన్ని అందించారు. గత ఆర్థిక సంవత్సరంలో మండల పొదుపు సంఘాలకు రూ. 30కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందాల్సి ఉండగా రూ.53 కోట్లను పొదుపు సంఘాలకు మండలసమాఖ్య అందించినట్లు సురేష్ తెలిపారు.

గ్రామాల్లో సమస్యల్ని పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

సంగెం, జూన్ 15 : మండలంలోని గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని శనివారం ఎంసీపీఐ పార్టీ నాయకులు సంగెం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రవీందర్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామాల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, విద్యుత్ దీపాలు లేవని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవని, పాత భవనాలు ఉన్నచోట్ల విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, మరుగుదొడ్లు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంసీపీఐ సంగెం మండల కార్యదర్శి ఇస్మాయిల్, గోనె రాంచందర్, ఆశోక్, దూడయ్య, శ్రీను పాల్గొన్నారు.

'రాధక్క మరణం పార్టీకి తీరనిలోటు'



రాధక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు

నల్లబెల్లి, జూన్ 15: గోదావరి లోయ ప్రతిఘటన ఉద్యమ నిర్మాత చంద్ర పుల్లారెడ్డి జీవిత సహచరి రాధక్క (86) అనారోగ్యంతో గత మూడు రోజుల క్రితం హైదరా బాద్‌లో మృతి చెందారు. శనివారం మండలంలోని మూడుచెక్కలపల్లిలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాధక్క మరణం పార్టీకి తీరని లోటని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తెలిపింది. రాధక్క మరణం పీడీత ప్రజలకు తీరని లోటని కూడా తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జక్కుల తిరుపతి, గుర్రం విజయ్, అజయ్, రవి, పరికి రత్నం, రమేష్, రవి, కోటన్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆ గ్రామాలకు కలగా మిగిలిన వట్టివాగుపై వంతెన నిర్మాణం

- వర్షాకాలం ప్రారంభం కావడంతో ఆందోళన చెందుతున్న ప్రజలు
- శిలా ఫలకానికే పరిమితమైన బ్రిడ్జి నిర్మాణం
- హై లెవల్ వంతెన, చెక్‌డ్యాం నిర్మాణానికి నిధులు మంజూరైన నిర్మాణం



నెక్కొండ మండలం పెద్దకొర్పోలు-చిన్నకొర్పోలు మధ్య ప్రవహిస్తున్న వట్టివాగు

నెక్కొండ, జూన్ 15 : మండలంలోని పెద్దకొర్పోలు-చిన్నకొర్పోలు గ్రామాల మధ్య ఉన్న వట్టివాగుపై వంతెన నిర్మాణం దశాబ్ద కాలంగా ఎన్నికల హామీలకే పని చేస్తుండగా, ప్రజల రాకపోకల విషయంలో నానా ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర సమయంలో వాగు దాటబోయి పలువురు మృత్యువాత పడగా, అనేక మంది నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రాణాలను కాపాడుకున్న సందర్భాలు అనేకం వున్నాయి. వాగు వల్ల పడుతున్న ఇబ్బందులను పలుమార్లు పాలకులు, అధికారు దృష్టికి తసుకుపోగా, వారి విజ్ఞాపనల మేరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కాలంలో వట్టివాగుపై హై లెవల్ వంతెన, చెక్‌డ్యాం నిర్మాణానికి పీఎంజీఎస్‌వై పథకం నుంచి రూ.13 కోట్ల నిధులను మంజూరి చేసింది. నిర్మాణం పనులను ప్రారంభించడానికి 2023 అక్టోబరులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నేతృత్వంలో శిలాఫలకం వేశారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణకు సంబంధించి సంబంధితాధికారులు నేటికి టెండర్లు పిలిచిన పాపనపోలేదు. ఈ విషయమై అధికారులను ప్రశ్నించగా ఎన్నికల కోడ్ అంటూ తప్పించుకుంటున్నారు. కానీ బ్రిడ్జి నిర్మాణానికి రాజకీయ గ్రహణం పట్టినట్లు తెలుస్తుంది. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభం కాని పక్షంలో మంజూరైన నిధులు కాస్తా వెనుకకుమరలే ప్రమాదం పొంచి ఉందంటూ చిన్నకొర్పోలు, పెద్దకొర్పోలు, నాగారం, ఇంటికన్నె, మడిపల్లి గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాగుపై హై లేవల్ వంతేన నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడంతో గత పది నెలల నుంచి శిలాఫలకం ప్రజలను వెక్కిరిస్తోంది. రాబోయేది వర్షా కాలం కావడంతో ఈ గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి పోతాయి.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు...

గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులతో పాటు చిన్నకొర్పోలు గ్రామానికి చెందిన 8, 9, 10వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సైతం వాగు కారణంగా ఇబ్బందులు పడక తప్పడం లేదు. పెద్దకొర్పోలులోని హై స్కూల్‌కు రావాలంటే వట్టి వాగు దాటాల్సిందే. గతంలో అత్యవసర సమయంలో రైతులు, ప్రజలు వాగు దాటబోయి మృత్యువాత పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. హై లేవల్ వంతెన నిర్మాణం పనులు ప్రారభమయ్యేది ఎప్పుడంటూ ప్రజలు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పనుల ప్రారంభంలో అధికారులు చొరవ చూపాలి

మహమ్మద్ ముంతాజ్, పెద్దకొర్పోలు



పెద్దకొర్పోలు-చిన్నకొర్పోలు గ్రామాల మధ్య వట్టివాగుపై హై లేవల్ వంతన నిర్మాణం లేని కారణంగా వాగు పరిసర గ్రామాల ప్రజలు రాకపోకల విషయంలో నిత్యం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాగు దాటాలంటే సాహసం చేయాల్సి వస్తుంది. వ్యవసాయ పనులకు వెళ్లే మహిళ కూలీలు వాగు ప్రవహిస్తున్న సమయంలో కూలీ పనులకు వెళ్లడంలేదు. దీంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.

నిధులున్నా.. ప్రారంభం కానీ నిర్మాణం పనులు

దయ్యాల వెంకట్, పెద్దకొర్పోలు



వట్టివాగుపై హై లెవల్ వంతెన నిర్మాణానికిగాను ప్రజల విజ్ఞాపణల మేరకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడం బాధాకరమైన విషయం. నిధులు మంజూరీ కావడంతో ఈ ప్రాంతంలో రాకపోకల విషయంలో తమ కష్టాలు తీరాయంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేయగా, బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభంలో జాప్యమవుతుండటంతో వారి ఆనందం ఆవిరవుతోంది. మంజూరైన నిధులు ల్యాప్స్ కాకముందే పనులను ప్రారంభించుటకు అధికారులు చర్యలు తీసుకోవాలి .